# సందిగ్ధంలో మెట్రో ఫేజ్-2

గడువు దాటినా పూర్తికాని డీపీఆర్ రూపకల్పన

సాక్షాత్తు ముఖ్యమంత్రి ఆదేశించినా పనుల్లో తీవ్ర జాప్యం

ఎలివేటెడ్ కారిడార్‌పైనా కొరవడిన స్పష్టత

ఆందోళనలో నార్త్‌సిటీ వాసులు



సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని నార్త్ సిటీ ప్రాంతానికి కీలకమైన మెట్రో మార్గంపై సందిగ్ధత నెలకొంది. ఈ ప్రాంతాన్ని పార్ట్-బీలో చేర్చి డీపీఆర్ రూపకల్పన చేస్తామని మెట్రో సంస్థ ప్రకటించగా... గడిచిన 4 నెలలుగా ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో తమ ప్రాంతానికి మెట్రో ఎప్పుడు వస్తుంది? అసలు వస్తుందా లేదా అనే సందిగ్ధంలో ఉన్నారు నార్త్ సిటీ ప్రాంతవాసులు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేస్తున్న జాప్యంతో నార్త్‌సిటీ ప్రాంతానికి తీరని నష్టం జరుగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు డీపీఆర్ రూపకల్పన, ప్రభుత్వానికి చేరడానికి ఇంకెంత సమయం పడుతుందో అని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### ముఖ్యమంత్రి ప్రకటించినా..

నార్త్‌సిటీ ప్రాంతానికి మెట్రో లైన్‌ను విస్తరిస్తామని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ డీపీఆర్ కూడా పూర్తికాలేదు. రెండో దశలో పార్ట్-బీగా నార్త్ సిటీతోపాటు, ఫ్యూచర్ సిటీ మెట్రో ప్రాజెక్టులను నిర్మిస్తామని హామీ ఇచ్చింది కాంగ్రెస్ సర్కార్. ఇందుకు 3 నెలల్లోగా డీపీఆర్ ప్రభుత్వానికి అందజేయాలని జనవరి 1న మెట్రో సంస్థను ఆదేశించింది. అయితే ఈ ప్రాజెక్టు విషయంలో డీపీఆర్ ఎందుకు జాప్యం అవుతుందనేది ఇప్పటికీ అంతు చిక్కడం లేదు. గడిచిన నాలుగున్నర నెలలుగా ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది.

### ప్రాజెక్ట్ మనుగడపై అనుమానాలు..!

ఓవైపు ఎలివేటెడ్ కారిడార్, మెట్రో మార్గాలను వేర్వేరుగా నిర్మించాలనే ప్రతిపాదనలు తెరమీదకు రావడం, ఇప్పటికీ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు భూసేకరణ పూర్తి కాకపోవడం, ప్యారడైజ్ నుంచి వెళ్లాల్సిన మార్గాన్ని జేబీఎస్‌కు మార్చడం ఇలా నార్త్‌సిటీ విషయంలో ఇటీవల జరిగిన అంశాలన్నీ ప్రాజెక్టు మనుగడపై అనుమానాలను పెంచుతున్నాయి. ఇక ప్రభుత్వం కూడా నార్త్ సిటీ మెట్రోపై స్పష్టమైన ప్రకటన చేయలేదు. ఇవన్నీ కలిసి ప్రాజెక్టును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. అయితే హెచ్ఏఎంఎల్ మాత్రం ఈ అంశాన్ని దాటవేసేలా, డీపీఆర్ తుది దశలో ఉందని, పలు మార్పులు, చేర్పులు జరుగుతున్నాయని.. త్వరలోనే డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని చెబుతోంది.

## డిఫెన్స్ రంగంలో విస్తృత పరిశోధనలు

- ఆర్మీకి ఉపయోగపడేలా డ్రోన్ల తయారీ

- ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



సంగారెడ్డి, మే 21(నమస్తే తెలంగాణ): దేశ రక్షణకు కావాల్సిన ఆయుధాల తయారీకి సంబంధించి మరిన్ని పరిశోధనలు చేస్తామని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. బుధవారం ఐఐటీహెచ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల భారత్ విజయవంతంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన నేపథ్యంలో ప్రతి పౌరుడిలో దేశం ముఖ్యం అన్న భావన పెరిగిందన్నారు. త్రివిధ దళాలకు ఉపగపడేలా అధునాతన ఆయుధాలు అందించేందుకు అవసరమైన పరిశోధనలపై ఐఐటీహెచ్ దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఇదివరకే ఐఐటీహెచ్‌లో ఆర్మీకి సంబంధించిన కేంద్రం ఏర్పాటు చేశామని, త్వరలోనే నేవీ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏఐ ఆధారిత డ్రోన్ల తయారీ, ఎయిర్ అంబులెన్స్‌ల తయారీపై పరిశోధనలు సాగిస్తున్నట్లు చెప్పారు. 200 కిలోల పేలోడ్ తీసుకెళ్లేలా డ్రోన్ తయారీకి సంబంధించిన పరిశోధనలు చురుగ్గా సాగుతున్నట్లు తెలిపారు. పరిశోధనలకు సంబంధించి ఐఐటీహెచ్ వద్ద రూ.325 కోట్ల నిధులు ఉన్నట్లు తెలిపారు. జపాన్‌తో కలిసి త్వరలోనే ఐఐటీహెచ్‌లో జాయింట్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆస్ట్రేలియాలోని స్విన్‌బర్న్ యూనివర్సిటీలో ఐఐటీహెచ్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సెమికండక్టర్ల రంగంలో అనేక కొత్త పరిశోధనలు తాము కొనసాగిస్తున్నట్లు మూర్తి చెప్పారు. తైవాన్ నేషనల్ యూనివర్సిటీతో కలిసి సెమి కండక్టర్లకు సంబంధించి సంయుక్తంగా పరిశోధనలు చేస్తున్నట్లు తెలిపారు.

## బ్యాలెట్ విధానంతోనే పారదర్శకంగా ఎన్నికలు

కేంద్రం ఎన్నికల కమిషన్‌ను బలహీనపర్చింది

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఖైరతాబాద్, మే 21: దేశంలో జరిగే ఎన్నికలు బ్యాలెట్ విధానంతో నిర్వహిస్తేనే పారదర్శకంగా ఉంటుందని వక్తలు అభిప్రాయపడ్డారు. దలీప్ సంస్థ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాటల్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల కమిషన్‌ను బలహీనపర్చిందన్నారు. కమిషన్ పారదర్శకంగా ఉండాలన్నది రాజ్యాంగం నిర్ధారించిన లక్ష్యమన్నారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వ హయాంలో ఎన్నికల నిర్వహణను విభేదించిన కమిషనర్లందరినీ తొలగింపచేశారన్నారు. ఎన్నికల కమిషనర్‌ను ప్రధాన మంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సభ్యులుగా నియమించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చీఫ్ జస్టిస్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించిందన్నారు. ఈసీని జేబు సంస్థగా మార్చుకున్నారన్నారు. ఈసీ అనేది నిప్పులాంటి సంస్థ అని, స్వతంత్ర్యమైన రాజ్యాంగ సంస్థ అని అన్నారు. ఎన్నికల కమిషన్ దివంగత టీఎన్ శేషన్ హయాంలో ఎంతో పారదర్శకంగా ఉండేదన్నారు.

### ఈవీఎంలపై అనుమానం..

బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను బలహీనపర్చడం వలన ఈవీఎంలపై అనుమానం కలుగుతోందన్నారు. కమిషన్‌కు సంబంధించిన డేటా మొత్తం పబ్లిక్ డొమైన్‌లో ఉండాలన్నారు. కాని అలా జరుగుడం లేదన్నారు. దీనిపై ఉన్న అనుమానాలను సైతం నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కన్వీనర్ వీవీ రావు మాట్లాడుతూ.. దేశంలో ఈవీఎంల పాత్రపై గతంలోనే అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయన్నారు. ఈవీఎంపై ఉన్న అనుమానాలను పాలక ప్రభుత్వం నివృత్తి చేయాల్సి అవసరం ఉందన్నారు. గెలిచిన వారు మౌనంగా, ఓడిన వారు మాత్రం ఈవీఎంలో లోపాలున్నాయని చెబుతున్నారని, 2000, 2004, 2009లోనే ప్రముఖ ప్రజాప్రతినిధులు దీనిపై అనేక అనుమానాలను వ్యక్తం చేశారన్నారు. మాక్ పోలింగ్, ప్రధానమైన ఎన్నికల ఓటింగ్‌లలో వ్యత్యాసాలు రావడమే అనుమానాలకు దారి తీసిందన్నారు. ఈవీఎం వాడే సాంకేతికత ఏమిటీ, ఎవరు డిజైన్ చేశారు, ఎన్నికల్లో వాడటానికి ఎవరు ప్రారంభించారని తదితర ప్రశ్నలు తలెత్తుతున్నాయని, ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రభుత్వంపై ఉంటుందన్నారు. ఈ సమావేశంలో దలీప్ సంస్థ అధ్యక్షురాలు బీఎన్ రత్న తదితరులు పాల్గొన్నారు.

## భాషపై సాధికారత ఉండాలి


సంపుటిలను ఆవిష్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, మే21: తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, పరిశోధకుడు డా.లగడపాటి సాంగయ్య రచించిన 'తెలుగు ధీర శతకం-ఆంధ్ర రఘు వంశం' పల్లె|పట్టణ పద్య కావ్య సంపుటి ఆవిష్కరణ బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా వెంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, గ్రంథాలయ పూర్వ అధ్యక్షుడు ఆయాచితం శ్రీధర్, ఆచార్య ముదిగొండ శివప్రసాద్ తదితరులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. తెలుగుపద్య రచనకు భాషపై సాధికారత ఉండాలని చెప్పా రు. తెలుగు ధీర శతకంలో తెలుగు జాతి పౌరుషం స్వాతం త్ర్యఉద్యమ సమయంలో తెలుగు వారి ధీరత్వాన్ని సాంగ య్య గొప్పగా వర్ణించారన్నారు. ఈ కార్యక్రమంలో కిన్నెర రఘురామ్, లగపాటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ర్యాంక్ నిబంధనను ఎత్తివేయాలి

బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్‌గౌడ్

రవీంద్రభారతి, మే21: ఇంజనీరింగ్ విద్యలో బీసీ విద్యార్థులకు 10వేల ర్యాంకు నిబంధనను ఎత్తివేయడంతో పాటు కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2008లో అప్పటి ప్రభుత్వంతో కొట్లాడి ఫీజు రియింబర్స్‌మెంట్‌ను సాధించామని, బీసీ-ఈలో ఉన్న ముస్లిం మైనార్టీలకు ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజులు ఇస్తున్నారని, బీసీ విద్యార్థులకు మాత్రం 10,000 ర్యాంకు నిబంధన పెట్టి మిగిలిన వారికి కేవలం 35,000 మాత్రమే ఇస్తున్నారని దానివల్ల టాప్-10 కాలేజీలో బీసీ విద్యార్థులకు సీట్లు వచ్చినప్పటికీ ఫీజులు రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు ఉండడంతో కట్టలేక చదువులకు దూరమవుతున్నారని విక్రమ్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ విద్యార్థులకు ర్యాంక్ నిబంధనలు ఎత్తివేస్తామని, మిగతా ఎస్సీ,ఎస్టీ , మైనార్టీ విద్యార్థుల లాగే బీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజు చెల్లిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌తో పాటు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిందని ఆయన గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 10వేల ర్యాంక్ నిబంధనను ఎత్తివేసి బీసీలకు న్యాయం చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని విక్రంగౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు.. కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, గొడుగు మహేష్ యాదవ్, ఇంద్రం, రజక విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

మావోయిస్టు అగ్రనేత కేశవరావు ఎన్‌కౌంటర్ బాధాకరం

ఇలాంటి చర్యలను మోదీ, అమిత్ షా మెచ్చుకోవడం శోచనీయం

తెలంగాణ పౌర హక్కుల సంఘం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

హిమాయత్ నగర్, మే 21: చత్తీస్‌గఢ్, నారాయణపూర్, బీజాపూర్ జిల్లాల సరిహద్దులోని మాడ్ సమీపంలో మావోయిస్ట్ అగ్రనేత నంబాల కేశవరావును ఎన్‌కౌంటర్ చేయడంపై తెలంగాణ పౌర హక్కుల సంఘం విచారణ వ్యక్తం చేసింది. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జీ లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు, అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భవానీ మాట్లాడారు. బరువైన గుండెలతో నిండుకున్న సందర్భంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావుతో పాటు 27 మందిని.. కేంద్ర ప్రభుత్వ భద్రతా బలగాలు మట్టుపెట్టాయని.. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. శభాష్ అని పొగడటం శోచనీయమన్నారు. పౌర సమాజం మొత్తం మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్నా చర్చలు జరపకుండా ఆయుధాలతో సమాధానం చెప్తూ 550 మందిని చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల విషయంలో కూడా కాల్పులు ఆపాలని అమెరికా అధ్యక్షుడుచెప్పేనే కేంద్ర ప్రభుత్వం వింటుందా అని ప్రశ్నించారు. శత్రు దేశంతో యుద్ధాన్ని ఆపిన ప్రభుత్వం..పౌర సమాజం మాటలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించడంతో పాటు భద్రతాబలగాలపై హత్యానేరం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చత్తీస్‌గఢ్ అడవులు శవాల గుట్టలుగా మారాయని.. తక్షణమే ఆపరేషన్ కాగార్‌ను నిలిపివేయాలన్నారు.

## మీడియా పాయింట్ ఐతే ఏంది..?

ఇక్కడ వాహనాలు ఎవడు పెట్టుకోమన్నాడు

సెక్రటేరియట్ వద్ద జర్నలిస్టులపై

ట్రాఫిక్ సీఐ దురుసు ప్రవర్తన

ఖైరతాబాద్, మే 21: ఇక్కడ బండ్లు ఎవడు పెట్టుకోమన్నాడు. ఇది మీడియా పాయింట్ అయితే ఏంది.... తీసేయ్ అంటూ జర్నలిస్టులపై ఓ ట్రాఫిక్ సీఐ బెదిరింపులకు దిగాడు. ప్రభుత్వం అధికారికంగా మీడియా కోసం కేటాయించిన స్థలంలోనే వాహనాలు పెట్టుకున్నామంటే కూడా వినకుండా దురుసుగా ప్రవర్తించాడు. సచివాలయం మీడియా పాయింట్ సాక్షిగా ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. బుధవారం తమ విధుల్లో భాగంగా జర్నలిస్టులు సెక్రటేరియేట్ మీడియా పాయింట్ వద్దకు వచ్చారు. అక్కడే ఎదురుగా వాహనాలు పార్కింగ్ చేశారు. అంతలోనే అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ సీఐ భాస్కర్ ఈ బండ్లు ఎవడు పెట్టుకోమన్నాడు...తీసివేయాలంటూ గద్దించాడు. ఇది తమ కోసం ప్రభుత్వం కేటాయించిన మీడియా పాయింట్ అని, కేటాయించిన స్థలంలోనే వాహనాలు పెట్టుకున్నామని, తమకు ఇదొక్కటే పార్కింగ్ ఉందని పలువురు జర్నలిస్టులు చెబుతున్నా వినకుండా మీడియా పాయింట్ ఐతే ఏందీ... తీసి పారేయండంటూ వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగకుండా పలువురు జర్నలిస్టులపై చేయి వేసి నెట్టివేశాడు. గత కొంతకాలంగా సదరు సీఐ జర్నలిస్టుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా మీడియా పాయింట్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాలను ఫొటోలు తీస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని పలువురు జర్నలిస్టులు తెలిపారు. నిత్యం ముఖ్యమంత్రి సహా, మంత్రులు, ఉన్నతాధికారుల ప్రెస్‌మీట్‌లు, మీడియా కాన్ఫరెన్స్‌ల కవరేజీ కోసం వచ్చే తమపై సీఐ ప్రవర్తన మీడియా హక్కులకు భంగం కలిగించడమేనంటున్నారు. సీఐపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మీడియా ప్రతినిధులతో వాగ్వాదం చేస్తున్న సీఐ భాస్కర్


తుర్కయంజాల్ :రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన దార్నం అరుణ-లక్ష్మీనారాయణ కుమారుడు వినయ్-నమ్రత వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి

## బోధనకు సాంకేతికతను జోడించాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

ఇబ్రహీంపట్నం, మే 21 : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు బోధన తీరును మెరుగుపర్చుకోవాలని రంగారెడ్డిజిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో ఇబ్రహీంపట్నం, యాచారం మండలాలకు చెందిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఐదురోజుల పాటు కెపాసిటీ బిల్డింగ్ ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు అనే అంశంపై కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన బుధవారం హాజరై మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. అత్యాధునిక సాంకేతికతను జోడించి బోధించటం అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ హీర్యానాయక్, యాచారం విద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి, గురుకుల విద్యాపీఠం ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు , డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ వరకాల పరమేష్, నర్సింహ తదితరులున్నారు.

## నేటి నుంచి టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాలు ప్రారంభం

వికారాబాద్, మే 21 : టీబీ ముక్త్ అభియాన్ కార్య క్రమంలో భాగంగా ఈ నెల 22 నుండి ఆగస్టు 29 వరకు వంద రోజులపాటు టీబీ రోగులను గుర్తించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రవీంద్రయాదవ్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని క్షేత్ర స్థాయి సిబ్బంది టీబీ వ్యాధికి గురయ్యే అధిక అవకాశమున్న మధుమేహం, అధిక రక్తపోటు, క్యాన్సర్, హెచ్ఐవి, పొగ త్రాగే అలవాటు ఉన్నవారు అధికంగా ఉంటారన్నారు. గత ఐదు సంవత్సరాల క్రితం టీబి వ్యాధికి గురైన వారు, టీబీ వ్యాధి కలిగిన రోగి కుటుంబ సభ్యులు అందరికీ కూడా తెమడ పరీక్ష , ఛాతీ ఎక్స్ రే పరీక్షల ద్వారా రోగ నిర్ధారణ పరీక్షలు చేయడం కొరకు సర్వే జరుగుతుందన్నారు. ఇందుకోసం జిల్లాకు ప్రత్యేకంగా పోర్టబుల్ ఎక్సరే మిషన్ అందుబాటులో ఉన్నదని తెలిపారు. 2030 నాటికి భారతదేశంలో టీబీ వ్యాధిని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్యశాఖ కృషి చేస్తుందని పేర్కొన్నారు. టీబీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం, సరియైన చికిత్స అందించడం, ఎవరు కూడా టీబీ వ్యాధి చికిత్స మధ్యలో ఆపివేయకుండా చూసుకోవడం ద్వారా టీబీ వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చన్నారు. టీబీ చికిత్స పొందుతున్న రోగులకు ఆరు నెలలపాటు నెలకు వెయ్యి రూపాయల చొప్పున సరియైన పోషకాహారం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని గుర్తు చేశారు. జిల్లా పరిధిలో ఎవరైనా దాతలు ముందుకు వచ్చినట్లయితే జిల్లాలోని టీబీ రోగులకు ఫుడ్ బాస్కెట్ అందించనున్నట్టు తెలిపారు. నేటి నుండి వికారాబాద్ జిల్లా తో పాటు రాష్ట్రంలోని మిగతా 22 జిల్లాలలో టీబి రోగుల కొరకు సర్వే జరుగుతుందని తెలిపారు.

## ఉద్యమకారుల హామీలను అమలు చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం

మల్కాజిగిరి, మే 21: కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆ ఫోరం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసి మే 25న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగే సమావేశానికి రావాలని ఆహ్వాన పత్రం అందజేశారు. జూన్ 2లోపు ప్రభుత్వం హామీలు అమలు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చిమ్మ శ్రీనివాస్, మీడియా అధికార ప్రతినిధి తాడూరి గగన్ కుమార్, ఉపాధ్యక్షురాలు జానకి రెడ్డి, గ్రేటర్ వైస్ ప్రెసిడెంట్ భూపాల్, టఫ్ ప్రతినిధి భాస్కర్, గ్రేటర్ కన్వీనర్ జగన్ యాదవ్, 1969 విభాగం కన్వీనర్ శివ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు వర్సిటీలో బీఎఫ్ఏ శిక్షణా తరగతులు

తెలుగు యూనివర్సిటీ, మే 21: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించే బీఎఫ్ఏ (బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్) శిల్పం, చిత్రలేఖనం కోర్సుల్లో చేరడానికి ఆసక్తిగల విద్యార్థులకు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కే హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని శిల్పం చిత్రలేఖనం శాఖ ఆధ్వర్యంలో శిల్పం, చిత్రలేఖనం మరియు ప్రింట్ మేకింగ్ అధ్యాపకుల ద్వారా కోర్సుకు సంబంధించిన శిక్షణా తరగతులను ఈనెల 26 నుంచి జూన్ 14 వరకు మూడు వారాల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 83090 11865, 83094 98807 నంబర్లలో సంప్రదించాలని రిజిస్ట్రార్ తెలిపారు.

## నామినేటెడ్ పోస్టులు బీసీలకు ఇవ్వరా?

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ, మే 21: రాష్ట్ర జనాభాలో 56% బీసీలు ఉన్నప్పటికీ నామినేటెడ్ పోస్టు ల్లో బీసీలను విస్మరించడం విడ్డూరంగా ఉన్నదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బుధవారం కాచిగూడని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో గుజ్జ సత్యం మాట్లాడుతూ నామినేటెడ్ పోస్టులన్నీ అగ్రవర్ణాలకే కట్టబెట్టారని, సమాచార కమిషనర్ నియామకాల్లో ఒక్కటి కూడా బీసీలకు ఇవ్వరా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో మొత్తం సమాచార కమిషనర్ పదవుల్లో ఇప్పటికే 7 పదవులు భర్తీ చేయగా.. అందులో ఒక్క బీసీకీ అవకాశం ఇవ్వకపోవడం బీసీలను అవమానించడమేనన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన ద్వారా బీసీలకు న్యాయం చేస్తామని గొప్పలు చెప్పి హామీ ఇచ్చారని, ఆ హామీలు ఇప్పటికీ అమలు కావడం కాకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో సౌతిండియా ఇన్‌చార్జి సూర్యనారాయణ, జానయ్య, నరేందర్, భద్ర, తదితరులు పాల్గొన్నారు.